సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం। 19। ఏప్రిల్। 2024



అభివృద్ధి పథం..

శ్రీజగన్నాథపురం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటయ్యాయి. - 8లో



మమేకమవుతూ..

నాయకులు జనాలతో మమేకమవుతున్నారు. వారితో కలిసిపోతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. - 8లో

ఈదురుగాలులకు కూలిన చెట్లు

పొందూరు: మండలంలోని తోలాపి, పిల్లలవలస, ధర్మపురం, కింతలి, కనిమెట్ట, తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్లు కూలడంతో పాటు స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులు ప్రారంభమయ్యాయి. క్రమేపీ పెద్దగాలులుగా మారడంతో కింతలి జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన భారీ చెట్టు కొమ్మ విరిగిపడింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చిరుజల్లులు పడి నిలిచిపోవడంతో మరింత ఉక్కపోత పెరిగింది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు త్వరితగతిన చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజులను త్వరితగతిన చెల్లించాలని, ఈనెల 24వ తేదీతో గడువు ముగుస్తుందని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు తెలిపారు. ఇటీవలి వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిలైన వారితో పాటు తమ మార్కులకు పెంచుకునేందుకు (ఇంప్రూవ్‌మెంట్/బెటర్‌మెంట్) ఆసక్తి చూపే విద్యార్థులు పరీక్ష ఫీజును ఈనెల 24 తేదీలోగా తమ కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నా రు. అలాగే ఇంటర్మీడియెట్ ఫలితాలపై సందేహాలున్న విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్ఐఓ చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్దేశించిన ఫీజులను చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. ప్రాక్టికల్స్‌లో ఫెయిలైన విద్యార్థులకు మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

ఏ ఫారం..బీ ఫారం అంటే..?

హిరమండలం: నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. అభ్యర్థులు 'ఏ' ఫారం, 'బీ' ఫారం పట్టుకుని ఆర్ఓ ఆఫీసుకు వస్తారు. అసలు ఈ ఫారాలకు అర్థాలేంటో తెలుసా..? గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రతిపాదిస్తూ ఇచ్చే పత్రాన్ని బీ ఫారం అంటారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులు తమ రాజకీయ పార్టీలు ఇచ్చిన బీఫారం దాఖలు చేయాలి. అప్పుడే ఆ అభ్యర్థికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ గుర్తు కేటాయిస్తారు. బీ ఫారంను పార్టీ అధ్యక్షుడు నిర్ణయించిన వ్యక్తి జారీ చేస్తారు. బీ ఫారం జారీచేసేందుకు సంబంధిత వ్యక్తికి పార్టీ అధ్యక్షుడు ఆమోదాన్ని తెలుపుతూ ఏ ఫారం అందజేస్తారు. ఏ ఫారం ఎవరి పేరు తో అధ్యక్షుడు ఇస్తారో ఆ వ్యక్తికి పోటీ చేసే అభ్యర్థులకు బీఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. తన పేరు మీద అందజేసిన ఏ ఫారంను ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల అధికారులకు పోటీ చేసే అభ్యర్థి అందజేయాల్సి ఉంటుంది.

'అప్రమత్తత అవసరం'

ఇచ్ఛాపురం: నామినేషన్ల సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ, జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం గేట్ కి ఇరువైపులా 100 మీటర్ల వరకు గల కటాఫ్ పాయింట్లు ఉండేలా చూసుకోవాలని పోలీసులతో అన్నారు. నామినేషన్ల ప్రక్రియకు వచ్చిన అభ్యర్థుల వాహనాలను కటాఫ్ పాయింట్ల వద్ద నిలపాలని సూచించారు. అభ్యర్థితో పా టు నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే తహసీల్దార్ గేట్ వరకు అనుమతి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఇ చ్ఛాపురం, సోంపేట సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం, కవిటి ఎస్ఐలు వి.సత్యన్నారాయణ, ఎస్.లక్ష్మణరావు, రాము పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఒక్క ఏడాది..

అభివృద్ధి అంటే ఇది!

● పోర్టు శంకుస్థాపనకు ఏడాది పూర్తి




ప్రస్తుతం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు స్వరూపం (ఇన్‌సెట్) ఏడాది క్రితం ఏప్రిల్ 19న సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపనలో భాగంగా బహిరంగ సభ వేదిక పై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

ఏడాది కిందట అక్కడేమీ లేదు. మరిప్పుడు.. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ పనులు పూర్తయ్యాయి. సముద్రంలో భారీ నౌకతో డ్రెడ్జింగ్ జరుగుతోంది. రోడ్డు, రైల్వే లైన్లకు భూములు సేకరించారు. పోర్టుకు భూములిచ్చిన వారికి పరిహారాలు అందాయి. ఇళ్లు, భూములు పోయిన వారి కోసం పునరావాస కాలనీ కడుతున్నారు. ఒక్క ఏడాదిలో జరిగిన మార్పులివి. సరిగ్గా ఏడాది క్రితం ఏప్రిల్ 19న సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4361.91 కోట్లతో నిర్మాణం తలపెట్టిన మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు ఏడాది కాలంలోనే అత్యంత పురోగతిని సాధించాయి. టెక్కలి జాతీయ రహదారి నుంచి మూలపేట పోర్టుకు అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. - టెక్కలి



ఏడాది క్రితం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

పేదోడి గుండె చప్పుడు



ఆరోగ్య శ్రీ.. ఇది కేవలం ప్రభుత్వ పథకం కాదు. రాత్రి వేళ నాలుగు మెతుకులు తింటూ రేపటికి తిండి ఎలారా దేవుడా అని మదన పడే సామాన్యుడికి ఆత్మీయ నేస్తం. నెలాఖరున బిడ్డకు సుస్తీ చేస్తే నిస్సహాయంగా ఖాళీ పర్సును తడిమి చూసుకునే మధ్య తరగతి మనిషి పాలిట అమృత హస్తం. పొరపాటున పెద్ద జబ్బేదో వస్తే రోగి కంటే ఎక్కువగా యాతన అనుభవించే ఆ ఇంటి పెద్దకు తోడుగా నిలిచే ఆత్మ బంధువు. పేదవాడిది కూడా ప్రాణమేనని, ఆ ప్రాణానికి బాధ్యత తీసుకునే ప్రభుత్వం మీకు ఉందని నిరంతరం గుర్తు చేసే సాధనం. ఈ కార్డు ముక్క ఇంటిలో కనిపిస్తే.. సగటు జీవికి అదో ధైర్యం. ఆ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు కనిపిస్తే నిరుపేదకు అదో భరోసా.

- అరసవల్లి/ఎచ్చెర్ల క్యాంపస్/టెక్కలి/నరసన్నపేట/ఇచ్ఛాపురం రూరల్

పునరుజ్జీవం..



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్యామ్ మజ్జి. ఇచ్ఛాపురం మండలం తిప్పన పుట్టుగ గ్రామం. గత ఏడాది సెప్టెంబర్‌లో కొబ్బరి చెట్టు మీద నుంచి పడిపోయారు. వెన్నుపూస ముక్కలైపోయింది. దాదాపు చావు అంచుల వరకు వెళ్లారు. కుటుంబ సభ్యులు బరంపురం ఆస్పత్రికి తీసుకెళ్తే ఆపరేషన్ చేయాలని చెప్పారు. అంత పెద్ద ఆపరేషన్‌కు డబ్బులు ఎలా సర్దుబాటు చేయాలో తెలీక ఆ కుటుంబం నరకయాతన అనుభవించింది. అప్పుడే వైజాగ్ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించవచ్చని తెలిసింది. అక్కడకు వెళ్లడంతో ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇప్పుడిప్పుడే ఆయన కోలుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్ తమ కుటుంబాన్ని కాపాడిన దేవుడని కుటుంబ సభ్యులు శ్యామ్ జమున, నిరంజన్, శ్రావణిలు అంటున్నారు.



ఆరోగ్యశ్రీ ప్రాణదాత



చిత్రంలో కనిపిస్తున్న వావిలపల్లి చిరంజీవిది ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్ గ్రామం. 40 ఏళ్లకే రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఆరోగ్య శ్రీ కింద కిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందిస్తున్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో రెగ్యులర్‌గా డయాలసిస్ జరుగుతోంది. ప్రభుత్వం కిడ్నీ పేషెంట్‌కు అందజేసే పింఛన్ సైతం వస్తోంది. ఆరోగ్య శ్రీ పథకం తనకు ప్రాణభిక్ష పెట్టిందని అతను చెబుతున్నాడు.

- ● ప్రజల మనసులో శాశ్వత స్థానం సంపాదించుకున్న ఆరోగ్య శ్రీ
- ● జిల్లాలో లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన పథకం
- ● 2019 నుంచి నేటి వరకు 2.68 లక్షల మందికి శస్త్రచికిత్సలు
- ● ఐదేళ్లలో రూ.569 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఆస్తులన్నీ ఆస్పత్రులకు ఖర్చయిపోగా ఆఖరకు అప్పులను కూడా పోగొట్టుకున్న వారెందరో. అసలు ఆస్పత్రికి వెళ్లాలనే ఆలోచన కూడా చేయకుండా ఇంటిలోనే ఊపిరి వదిలేసిన వారు ఇంకెందరో. ఇలాంటి గడ్డు పరిస్థితుల గురించి తెలుసుకుని పేదల ప్రాణాలకు రక్షణగా అప్పట్లో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టిన మహత్తర పథకం ఆరోగ్య శ్రీ. తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే.. తనయుడు మరో పది అడుగులు ముందుకు వేశారు. తండ్రి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పరిధిని పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని మరింత మందికి చేరవ చేశారు. ఈ పథకం పరిధిలోకి ఏకంగా 3,257 జబ్బులను చేర్చడంతో పాటు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోగ్యశ్రీ పరిధిని ఏకంగా రూ.25 లక్షల వరకు పెంచుతూ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తోంది. దీంతో పేద,సామాన్య వర్గాలకు ఆరోగ్య బెంగ తీరిపోయింది. అలాగే గుండె జబ్బుతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద జబ్బులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చింది. గతంలో ఈ ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి ప్రొసీజర్‌ను ఉచితంగా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 2019 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2.68 లక్షల మందికి వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేయగా..రూ.569 కోట్లకు పైగా ఖర్చు భరించి ఆరోగ్యశ్రీ ద్వారానే సేవలందించారు.

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి

ఆరోగ్యశ్రీ పథకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన పెరగాలనే సదుద్దేశంతో ఆరోగ్యశ్రీని ప్రత్యేకంగా యాప్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కార్డుల పంపిణీని కొద్ది నెలల క్రితమే ప్రారంభించింది. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజల సొంత ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, ఎలా వినియోగించాలో ఇప్పటికే ఇంటింటి డ్రైవ్‌లో ప్రజలకు వైద్య సిబ్బంది వివరించారు. మొత్తం 6,39,427 స్మార్ట్ కార్డుల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేశారు.

ఆరోగ్యశ్రీ ఆదుకుంది...

టెక్కలి గొల్లవీధికి చెందిన ఈదు చిన్నంనాయుడు గత ఏడాది అక్టోబర్ నెలలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రెండు కాళ్లతో పాటు నడుము కింద భాగం దెబ్బతింది. ముందు రిమ్స్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి జెమ్స్‌కు పంపించారు. అక్కడ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ నవంబర్ నెలలో ఆపరేషన్ చేశారు. లక్ష రూపాయలకు పైగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సాయం అందింది. ప్రస్తుతానికి ఇంటి వద్ద కోలుకుంటున్నారు.

ఈ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు

ఏడాది	జరిగిన శస్త్రచికిత్సలు	ఖర్చు చేసిన మొత్తం
2019-20	33,312	రూ. 84.40 కోట్లు
2020-21	35,185	రూ. 95.08 కోట్లు
2021-22	61,357	రూ. 145.16 కోట్లు
2022-23	74,206	రూ. 106.45 కోట్లు
2023-24 (ఏప్రిల్1వరకు)	64,829	రూ. 138.68 కోట్లు
మొత్తం	2,68,889	రూ. 569.77 కోట్లు

ప్రాణదానం



ఈమె పేరు వైశ్యరాజు శాంత లక్ష్మి. నరసన్నపేటలోని కలివరపుపేట. భర్త లేరు. ఇద్దరు పిల్లలను తన రెక్కల కష్టం మీదనే పెంచుతున్నారు. అమ్మాయికి వివాహమైంది. కుమారుడు చేతికి అందివచ్చాడు. ఇప్పటికైనా కాసింత విశ్రాంతి తీసుకుందామనుకున్నారు. కానీ అప్పుడే ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ సోకింది. క్యాన్సర్ చికిత్స అంటే సాధారణ విషయం కాదు. దీంతో ఆమె ప్రాణాల మీద ఆశ వదిలేశారు. ఇంతలో ఆ వీధి వలంటీర్ ఆమె విషయాన్ని తెలుసుకుని ఆరోగ్యశ్రీ ద్వారా విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడకు వెళ్తే అన్ని పరీక్షలు చేశారు. కీమో థెరపీ కూడా చేశారు. ఆపరేషన్ నిర్వహించి 8 నెలలవుతోంది. ఇప్పుడు తాను ప్రాణాలతో ఉన్నానంటే అది ఆరోగ్య శ్రీ పథకం పుణ్యమేనని ఆమె చెబుతున్నారు.

వెళ్లిన వెంటనే ఆపరేషన్ చేశారు



ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన ఈమె పేరు ఎం.చంద్రమ్మ. ఈ ఏడాది జనవరిలో ఇంటి పనులు చేస్తుండగా పట్టుతప్పి కింద పడటంతో కుడి కాలు విరిగిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఈమెకు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. ఇంటికి వచ్చిన వారం రోజుల్లో తన ఖాతాలో వైఎస్సార్ ఆసరా కింద హెల్త్‌కేర్ సెంటర్ వారు రూ.10వేలు వేశారు.

క్యాన్సర్‌కు చికిత్స...



ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన పైడి ముకుందరావు రైతు కూలీ. అతడికి క్యాన్సర్ వ్యాధి సోకింది. ఆరోగ్యశ్రీ పథకమే ఆయనను ఆదుకుంది. ఇప్పుడు విశాఖపట్నంలోని హెసీజీ క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం కీమో థెరపీ చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ తమ లాంటి వారికి సంజీవని అని ఆయన అంటున్నారు.

విజయఢంకా మోగించేందుకు

'మేమంతా సిద్ధం'



మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కృష్ణదాస్, రెడ్డి శాంతి, కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ, నర్తు రామారావు, ఎంపీ అభ్యర్థి తిలక్, సాయిరాజ్, అంధవరపు సూరిబాబు

- ● కుప్పం, టెక్కలి నియోజకవర్గాల్లో విజయ పతాకం ఎగురవేద్దాం
- ● 24న టెక్కలిలో సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు
- ● యాత్ర సన్నాహక సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

టెక్కలి: టెక్కలిలో ఈ నెల 24న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. యాత్రకు సంబంధించి గురువా రం టెక్కలిలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గల కీలకమైన నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టెక్క లి నియోజకవర్గంలో గత టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఇటీవల టీడీపీ నాయకులు చేసిన కుట్ర పూరిత చర్యల వల్ల దివ్యాంగులు, వృద్ధులు ఎలా ఇబ్బంది పడ్డారో ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయి రాజ్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంత్‌రెడ్డి, నాలుగు మండలాల అధ్యక్షులు కె.అజయ్‌కుమార్, కె.సతీష్, ఎస్.సత్యరాజ్, టి.పాల్గుణరావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఎస్.సత్యం, బి.మురళీ, కె.జగన్నాయకులు, నాయకులు చింతాడ గణపతి, చింతాడ రవికుమార్, ఎం.స్వరూప్, కె.రాజేశ్వరరావు, టి.కిరణ్, ఆర్.మల్లయ్య, ఎస్.హేమ సుందర్‌రాజు, ఎం.అప్పారావు, ఎ.కల్యాణి, జేసీఎస్ ఇన్‌చార్జిలు ఎస్.మోహన్, జె.జయరాం, జి.నాగుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి



టెక్కలి నియోజకవర్గంలో ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో దశాబ్దాల అభివృద్ధి జరిగింది. సుమారు 1500 కోట్ల రూపాయలతో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేశారు. మూలపేట పోర్టుతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు రూ.7 వేల కోట్లు వెచ్చించారు. టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని సీఎంకు కానుకగా ఇస్తాం. - దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టెక్కలి

టెక్కలి విజయం ఎంతో కీలకం




ఈ ఎన్నికల్లో టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం విజయం ఎంతో కీలకం. ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు ఎంపీ అభ్యర్థి సమన్వయంతో నాయకులతో కలిసి విజయం వైపు పయనించాలి. టెక్కలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయ సంకేతాలు కనిపించాలి. -మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్

జనం సిద్ధంగా ఉన్నారు..



గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. ఈ నెల 24న టెక్కలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను అన్ని వర్గాలు విజయవంతం చేయాలి. - ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు.

ప్రతిపక్షాల వెన్ను వణకాలి



టెక్కలిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రతో ప్రతిపక్షాల వెన్ను వణకాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాలు ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలి. - పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి.



టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అతికించిన నోటిఫికేషన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

● నామినేషన్ల పర్వం

తొలి రోజు 6

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా తొలిరోజు అసెంబ్లీ స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. టెక్కలి స్థానానికి తొలి రోజు ఒక నామినేషన్ పడింది. అలాగే ఇచ్ఛాపురంలోనూ ఒకరు నామినేషన్ వేశారు. ఎచ్చెర్లలో తొలిరోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారాలను దరఖాస్తు చేశారు. అలాగే ఆమదాలవలస నియోజకవర్గానికి ఇద్దరు నామినేషన్లు వేశారు. పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, నరసన్నపేటలో తొలిరోజు నామినేషన్లు వేయలేదు.

ఎందుకంత అహంకారం..?



- ● యాదవ సామాజిక వర్గాన్ని దూషించిన గొండు జగపతి
- ● టీడీపీ నాయకుడి వ్యాఖ్యలతో గుర్రుగా యాదవ సామాజిక వర్గం
- ● అహంభావంతో కుల దూషణ తగదని హెచ్చరిక
- ● ఎన్నికల్లో బుద్ధి చెప్పే యోచనలో యాదవులు

పొలిటికల్ బీట్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీపై యాదవ సామాజిక వర్గం సీరియస్‌గా ఉంది. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేస్తున్న గొండు శంకర్ తండ్రి జగపతి చేసిన వ్యాఖ్యలు యాదవ సామాజిక వర్గీయులను తీవ్రంగా బాధపెట్టాయి. పరుష పదజాలం, నోటికొచ్చిన బూతులతో యాదవ కులస్తులను దూషించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అహంభావంతో తమపై మాట్లాడారని, రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని ఆ సామాజిక వర్గం ఇప్పటికే నిర్ణయించుకుంది. తమ సామాజిక వర్గానికి చెందిన, తన పార్టీకి చెందిన వ్యక్తితో జరిపిన ఫోన్ సంభాషణలో శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ తండ్రి, మాజీ ఎంపీపీ గొండు జగపతి ఆ సందర్భంగా యాదవులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యాదవులను తక్కువ చేసి మాట్లాడారు. తీవ్రపదజాలంతో దూషించారు. ఆ సంభాషణలో కొనసాగింపుగా నోటికొచ్చిన బూతు పురాణం విప్పారు. ఆ ఫోన్ సంభాషణ బయటకు రావడంతో టీడీపీ నాయకుడు అసలు స్వరూపం వెలుగు చూసింది. ఇప్పుడీ వ్యాఖ్యలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. యాదవ సామాజిక వర్గాన్ని ఆవేదనకు గురి చేశాయి. గొండు జగపతి చేసిన వ్యాఖ్యల్ని యాదవులంతా సీరియస్‌గా తీసుకున్నారు. తేలికగా తీసుకుంటే భవిష్యత్‌లో మరొకరు తప్పుడు ప్రేలాపనకు దిగుతారని, సామాజిక వర్గంపై చులకనగా మాట్లాడిన వారికి సరైన సమయంలో సరైన శిక్ష విధించాలని యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రాంతాల వారీగా సమావేశాలు పెట్టుకున్నారు. నందిగాంలోనైతే టెక్కలి నియోజకవర్గ యాదవులంతా విలేకర్ల సమావేశం పెట్టి తమ ఆవేదన తెలియజేశారు. ఇప్పటికే టీడీపీపై యాదవులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షకు పైగా ఓటర్లు ఉన్నప్పటికీ ఆ సామాజిక వర్గానికి టీడీపీ ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు. ఒక్క నాయకుడిని గౌరవించిన దాఖలాల్లేవు. రాజకీయంగా వాడుకోవడం తప్ప ఆ సామాజిక వర్గానికి చేసిందేమీ లేదు. అదే వైఎస్సార్‌సీపీ విషయానికొస్తే యాదవులకు పదవుల్లో పెద్ద పీట వేసింది. ఆ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించింది. ఇక్కడొక్క చోటే కాదు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ యాదవులకు సముచిత స్థానం కల్పించింది. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులతో గౌరవం పెంచింది. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాల కన్న ఎక్కువగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజకీయంగా ప్రోత్సహించింది. ఒక పక్క వైఎస్సార్‌సీపీ పదవులు, సంక్షేమ పథకాలతో వారిని ఉన్నతంగా చూస్తుంటే టీడీపీ నాయకులు ఆ సామాజిక వర్గాన్ని చులకన చేసే విధంగా, నీచంగా మాట్లాడి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. ఎన్నికలప్పుడే ఇంత బరితెగిస్తే.. అవసరం తీరాక వారి నైజం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని యాదవుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. జగపతి వ్యాఖ్యలను ఒక్క టీడీపీ నాయకుడు కూడా ఖండించలేదని.. ఆ వ్యాఖ్యలు తప్పు అని ఆ పార్టీ సరిదిద్దుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఆవేదనతో ఉన్నారు.

క్లుప్తంగా

'జోడీ' పండు



ఎచ్చెర్ల మండలంలోని చినరావుపల్లిలో నంబాడ సూర్యనారాయణకు చెందిన జీడిమామిడి తోటలో మంగళవారం ఒకే జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. ఈ విషయమై ఎచ్చెర్ల వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జన్యులోపాల వల్ల ఇటువంటివి ఏర్పడతాయని చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వాసుదేవుని సన్నిధిలో మంత్రి సీదిరి



గోమాతకు పండ్లు తినిపిస్తున్న మంత్రి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి, పలాస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సమేతంగా గురువారం మందసలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. నామినేషన్ వేయనున్న సందర్భంగా సంబంధిత పత్రాలను స్వామివారి పాదాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అప్పలరాజు, శ్రీదేవి దంపతులు గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాట



గాయపడిన కూన కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేటలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గురువారం కొట్లాట జరిగినట్లు ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. శుభకార్యం వద్ద ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారని, ఈ ఘటనలో కూన కిరణ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించామని చెప్పారు. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల సొంత బావపైన జరిగిన దాడి కేసులో కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

భారతీయ వారసత్వ సంపద అమూల్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇంటాక్ శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళంలోని డచ్ భవనం వద్ద ప్రపంచ వారసత్వ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం న్యూఢిల్లీ ఇంటాక్ సంస్థ పంపిన శాశ్వత సభ్యత్వాన్ని కన్వీనర్ చేతుల మీదుగా జగన్మోహనరావుకు అందించారు. కార్యక్రమంలో సహాయ ఇంటాక్ సహాయ కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు, నటుకుల మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజగన్నాథపురం.. అభివృద్ధి పథం..

మండలం : కోటబొమ్మాళి
పంచాయతీ : శ్రీజగన్నాథపురం
అనుబంధ గ్రామాలు : పొడుగుపాడు, బిర్లంగి, కుజ్జిపేట, రామచంద్రాపురం, రామకృష్ణాపురం
జనాభా : 2008 మంది

కోటబొమ్మాళి: శ్రీజగన్నాథపురం.. టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోని కోటబొమ్మాళి మండలంలోని ఓ పంచాయతీ. పొడుగుపాడు, బిర్లంగి, కుజ్జిపేట, రామచంద్రాపురం, రామకృష్ణాపురం అనుబంధ గ్రామాలు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల కిందట వరకు ఈ పంచాయతీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. ముఖ్యంగా ఇక్కడి ప్రజలు తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉంటున్నారన్న కక్షతో అచ్చెన్నాయుడి కుటుంబం శీతకన్ను వేసింది. ఫలితంగా మౌలిక సదుపాయాల సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం దక్కేది కాదు. ఇలాంటి తరుణంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చింది. పేదల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో అన్ని పంచాయతీల మాదిరిగానే శ్రీజగన్నాథపురం రూపురేఖలు కూడా సమూలంగా మారాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, వెల్‌నెస్ కేంద్రం, పక్కా రోడ్లు, కాలువలు.. ఇలా ఒకటేమిటి ప్రతి సంక్షేమ ఫలం గ్రామానికి అందడంతో అన్ని కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



సచివాలయం భవన సముదాయం



శ్రీజగన్నాథపురం పంచాయతీ తారురోడ్డు



రైతు భరోసా	బియ్యం కార్డులు	జగనన్న ఇళ్లు	ఇళ్ల స్థలాలు	పెంఛన్లు
799 మంది	720 మంది	76 మంది	51 మంది	346 మంది

అమ్మ ఒడి	వైఎస్సార్ చేయూత	విద్యాదీవెన	వాహనమిత్ర	సున్నావడ్డీ
163 మంది	122 మంది	185 మంది	20 మంది	40 మంది



సీసీ రోడ్డు

అంకెల్లో అభివృద్ధి	
సచివాలయ సముదాయానికి ఖర్చు	సుమారు రూ.కోటి
డ్వాక్రా భవనం, డిజిటల్ లైబ్రరీ	రూ. 30 లక్షలు
పాఠశాలలో నాడు–నేడు పనులు	రూ.35 లక్షలు
ఇంటింటి కుళాయిలు	రూ.12 లక్షలు
అమ్మవారి గుడి కల్వర్టు	రూ.1.5లక్షలు
పొడుగుపాడులో సీసీ రోడ్డు	రూ.5లక్షలు
ఎస్సీవీధిలో సీసీ రోడ్డు	రూ.5 లక్షలు
సీసీ కాలువలు	రూ.5 లక్షలు
రామచంద్రపురంలో సీసీ రోడ్డు	రూ.10లక్షలు
కుజ్జిపేటలో బీటీ రోడ్డు	రూ.20లక్షలు
రామచంద్రపురం గ్రావెల్ రోడ్డు	రూ.4లక్షలు
ఎర్రచెరువు, కుజ్జిపేట చెరువుల మదుముల నిర్మాణం	రూ.8లక్షలు
పొడుగుపాడు– శ్రీజగన్నాథపురం వీధిలైట్లు	రూ.50 వేలు

వైఎస్సార్ సీపీ హయాంలోనే..



70 ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే జరిగింది. మా పంచాయతీలో మెజార్టీ ఓటర్లు గతంలో వైఎస్సార్‌కు, ప్రస్తుతం సీఎం జగన్‌మోహనరెడ్డికి అనుకూలంగా ఉన్నారు. అందుకే టీడీపీ పాలనలో మా పంచాయతీని నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సహకారంతో సుమారు రూ.ఆరు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశాం.

– నూక సత్యరాజు, సర్పంచ్, శ్రీజగన్నాథపురం పంచాయతీ



మహిళా సమాఖ్య భవనం, డిజిటల్ లైబ్రరీ

జగనన్న పాలనలోనే ప్రైవేటు బోధన సిబ్బందికి న్యాయం



స్పీకర్‌తో ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు

ఆమదాలవలస: ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వైఎస్సార్ సీపీ పాలనలోనే న్యాయం జరిగిందని పలువురు బోధన సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు ఆధ్వర్యంలో స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిశారు. ఈపీఎఫ్, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించేలా చొరవ తీసుకోవాలని విన్నవించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఎమ్మెల్యేగా తమ్మినేని సీతారాం, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన వ్యయ పరిశీలకుడు



కలెక్టర్‌తో నవీన్‌కుమార్ సోని

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను వ్యయ పరిశీలకుడు నవీన్‌కుమార్ సోని గురువారం గౌరవ పూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించి చర్చించారు. అనంతరం వ్యయ పరిశీలకుల బృందంతో సమావేశమయ్యారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఆమదాలవలస రూరల్: పేదలకు నిరంతరం సంక్షేమం అందాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం చిట్టివలస పంచాయతీలో కూన నాగు ఆధ్వర్యంలో గురువారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 15 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బమ్మిడి అచ్యుతరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, జేకే వెంకుబాబు పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో కొత్తూరు మండలం ఓంధ్రుజోల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన బమ్మిడి శివ, బడ్డి అప్పలనాయుడు, నిమ్మగడ్డ తేజ, హడ్డుబంగి మణికంఠ, భీమవరపు కృష్ణారావు, రామారావు, వెంకటేష్, కోర్నాన లక్ష్మీనారాయణ, నక్క రమణతో పాటు 21 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ గంధవరపు నాగేంద్ర, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోగుల వరప్రసాద్‌నాయుడు, చింతాడ సూర్యనారాయణ, పడాల లక్ష్మణరావు, బుర్లె శ్రీను, నాగేంద్ర పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, కర్లెమ్మ గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురపాక శంకరరావు, పల్ల రామలింగం, దుక్క అప్పారావు, కోరాడ నూకరాజు, లక్ష్మీనారాయణ, కర్లెమ్మకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఎద్దు ప్రసాదరావు, కొత్తూరుకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వడమ శ్రీనివాసరావు, టొంపల వెంకటరావు, దొర్నాన ఎండు నాయుడు, వడమ జవరాజు, జి.పోలయ్య, టి.త్రినాథ్ టి.రాంబాబు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి శ్రావణ్‌కుమార్, కొత్తూరు సర్పంచ్ పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాదరావు, బూర్లె శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు

కాశీబుగ్గ: మందస మండలం దేవుపురం గ్రామానికి చెందిన పది కుటుంబాలు మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యారావు,నాయకులు హనుమంతు వెంకటరావుదొర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళం 34వ డివిజన్‌లో టీడీపీ మాజీ కౌన్సిలర్ పొందూరు వెంకటరమణ గురువారం మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి కోరారు.



టీడీపీ మాజీ కౌన్సిలర్ పొందూరు వెంకటరమణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కొత్తూరు: కర్లెమ్మ, కొత్తూరు టీడీపీ నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస: చిట్టివలస నుంచి పార్టీలో చేరిన వారితో స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: పార్టీలో చేరిన దేవుపురం నాయకులతో మంత్రి సీదిరి అప్పలరాజు



పాతపట్నం: వైఎస్సార్‌సీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి

గార: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేశామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం శిమ్మపేట జంక్షన్‌లోని కల్యాణ మండపంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో పేదలకు ఏ హామీలు ఇచ్చామని, వాటినే మేనిఫెస్టోలో రూపొందించి 99 శాతం అమలు చేశామని చెప్పారు. బీసీ వర్గాలకు రాజకీయంగా అనేక నామినేటెడ్ పదవులు ఇవ్వడంతో పాటు పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు. బీసీల ఓట్లు వేయించుకున్న టీడీపీ వారి అభ్యున్నతికి ఏం చేసిందని ప్రశ్నించారు. బీసీలను వాడుకొని వదిలేసిన మనస్తత్వం చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ప్రజల్లో తారతమ్యాలు ఉండకూడదనే ఉద్దేశంతో విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. పిల్లల బాగు కోసం తల్లి, తండ్రి ఎలా ఆలోచిస్తున్నారో ఈ ప్రభుత్వం కూడా అలాగే ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జన్మభూమి కమిటీ అనే బ్రోకర్ల ప్రభుత్వం కావాలా.. పేదల సంక్షేమానికి కృషి చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కావాలో మీరే నిర్ణయించుకోవాలన్నారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, అంబటి చినబాబు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, బరాటం నాగేశ్వరరావు, శిమ్మ ధర్మరాజు, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నేడు వైఎస్సార్ కూడలిలో మానవహారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటరు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి వద్ద కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు ఎం.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ ర్యాలీ నిర్వహించి స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మమేకమవుతూ.. ముందుకు సాగుతూ..

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రజలతో మమేకమవుతూ క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. హామీలు కచ్చితంగా అమలు చేస్తామంటూ భరోసా కల్పిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం



శ్రీకాకుళం 36వ డివిజన్‌లో వందాన కుటుంబానికి కరపత్రాలు అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కవిటి: వరక గ్రామంలో ప్రచారంలో భాగంగా మిషన్ కుదుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



ఆమదాలవలస: ఐజేనాయుడు కాలనీలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ఎచ్చెర్ల: లావేరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



కొత్తూరు: కుంటిభద్రలో ఉపాధి వేతనదారులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి



వజ్రపుకొత్తూరు రూరల్: గుళ్లలపాడులో మంత్రి సీదిరి అప్పలరాజును ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు